క్లుప్తంగా

వైభవంగా విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో కొలువై ఉన్న గంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజులపాటి తిరుమల యశోదనరావు, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శైవాగమ బ్రహ్మ గూడూరు రామకృష్ణశర్మ యాజ్ఞికత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుతగా స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శాంతి కల్యాణం చేశారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మణుగునూరులో భూసర్వే

మండవల్లి: మండలంలోని మణుగునూరులో బుధవారం భూసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.జనార్దనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన భూసర్వే కార్యక్రమం ద్వారా ప్రజలకు తమ హద్దులు సక్రమంగా తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. కొలతలు కచ్చితంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సర్పంచ్ మొగనాటి తులసీరత్నం, ఎంపీటీసీ, సర్వేయర్లు, టెక్నికల్ టీమ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గ పదవీకాలం పొడిగింపు

గుడివాడటౌన్ :గుడివాడ రూరల్ మండలం మోటూరు పీఏసీఎస్ పాలకవర్గ పదవీకాలం పొడిగించినట్లు డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ డివిజన్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. స్థానిక పాటిమీద గల డివిజన్ కార్యాలయంలో బుధవారం ఈ మేరకు నియామకపత్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి అశోక్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరి పాలకవర్గం పదవీకాలం పొడిగించామని చెప్పారు. గత నెల 30వ తేదీతో పదవీకాలం ముగిసిందని తిరిగి ఆరు నెలలు కాలపరిధిని పెంచామని పేర్కొన్నారు. చైర్మన్ ఇమ్మడి అశోక్ కుమార్, సభ్యులు తూము తాతబ్బాయ్, గండికోట వెంకట కుమారిలు జూలై 30వ తేదీ వరకు ఈ పదవిలో కొనసాగుతారన్నారు.

జేఈఈ-మెయిన్స్‌లో రంజిత్‌రెడ్డికి 99.70 పర్సంటేజ్



పామర్రు:జేఈఈ–మెయిన్స్–2023లో పామర్రుకు చెందిన విద్యార్థి కొల్లి రంజిత్‌రెడ్డికి 99.70 పర్సంటేజ్ మార్కులను సాధించి విజయపథంలో నిలిచారు. గుడివాడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ లాయర్ కొల్లి వెంకట్రామకృష్ణారెడ్డి, సుజాత దంపతుల కుమారుడు రంజిత్ రెడ్డి విజయవాడలోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీలో ఇంటర్ చదువుతూ జేఈఈ–మెయిన్స్ పరీక్షలు రాసి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. భవిష్యత్‌లో ఎన్ఐటీలో ఉచిత సీటు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని స్థానికులు విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ టి. శ్రీనివాసరావు ఆకాంక్షించి అభినందనలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత



గుడివాడటౌన్: మందపాడులోని మున్సిపల్ నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో వృద్ధులకు బుధవారం ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భారత రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 125వ జయంతిని పురస్కరించుకుని వృద్ధులకు కూరగాయలు, పండ్లు, బియ్యం, ఇతర సరుకులు అందించారు. తొలుత జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ సభ్యులు లింగం చిట్టిబాబు వితరణతో ఇవి ఏర్పాటు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు

పెదపారుపూడి:విద్యుత్ చౌర్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వరరావు గుడివాడ డివిజన్ ఈఈ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ చౌర్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 39 బృందాలుగా ఏర్పడి 3221 గృహ విద్యుత్ సర్వీసులు, 220 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశామని పేర్కొన్నారు. 202 సర్వీసులు అదనపు లోడుకి గాను రూ.5.42 లక్షల జరిమానా విధించామని చెప్పారు. అనుమతి ఇచ్చిన కేటగిరీ కాకుండా వేరే కేటగిరిలో వాడుతున్న ఇద్దరు వినియోగదారులకు రూ.6,500 జరిమానా వేశామని పేర్కొన్నారు. ఎక్కడైన విద్యుత్ చౌర్యం జరిగితే 9440812086, 9440817579 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏడీ దశరథ్, మండల ఏఈ వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో ఆనందోత్సాహాలు

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- చినపులిపాకలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



బొడ్డపాడులో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనతో గడప గడపలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని చినపులిపాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటంతోపాటు బ్రోచర్లు పంపిణీ చేశారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పాలనతో కొత్త ఒరవడి...

సంక్షేమ పాలనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఒరవడి సృష్టించారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. కుల, మత, పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ (రాము), మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నడకుదురు రాజేంద్ర, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, ఎంపీటీసీ దారం రోజారాణి, నాయకులు గోపిశెట్టి ఫణికుమార్, పాగోలు వెంకటేశ్వరరావు, వడ్డాణపు దుర్గ, దారం నాగగోపి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేస్తూ ఉత్తర్వులు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా మార్పు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పామర్రు నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. సీహెచ్‌సీగా ఏర్పడటంతో 30 పడకలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అంతే కాకుండా 38 మంది నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణతో కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. మొత్తం రూ.8.18 కోట్ల అంచనా విలువలతో సీహెచ్‌సీ పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు గైనకాలజిస్టు, ఎనస్తీషియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్, సర్జన్ జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పామర్రు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పుదల చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే మంజూరు చేశారన్నారు.

విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి

పామర్రు(పమిడిముక్కల): విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం ఓ వరం అని జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి తెలిపారు. పమిడిముక్కల మండలం మంటాడ సచివాలయం పరిధి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ –2 కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద పథకాల నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ భోజనాలు ప్రతి రోజూ ఇదే విధంగా నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యా రంగ అభివృద్ధికి ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పాఠశాల హెచ్ఎం ప్రకాష్‌కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కోనతం శివరామకృష్ణ, అబ్దుల్ అజీజ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు సుభాషిణి, నాగేశ్వరరావు, సుబ్బయ్య, అంగన్‌వాడీ టీచర్ కె.కృష్ణవేణి, బి. నాగ భవాని పాల్గొన్నారు.

జననేతతోనే అన్ని వర్గాల సంక్షేమం

కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



వృద్ధురాలికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

ముదినేపల్లి రూరల్: జననేత, ముఖ్యమంత్రి జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెయ్యేరు శివారు ఆటో నగర్, అప్పారావుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తరువాత గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న కావడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలనే ధ్యేయంతో ఎన్నో పథకాలు అమల్లోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఆక్వా రైతులకు కొల్లేరు తీర ప్రాంత ప్రజలకు పలు ప్రయోజనాలు కల్పించే పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అప్పారావుపేటలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సైతం పరిశీలించి బాలల సంరక్షణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీటీసీ సభ్యుడు కోటే ప్రవీణ్, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా మండల కో–ఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, శీలం రామకృష్ణ, జాస్తి రాజేంద్రప్రసాద్, ఈడే వెంకటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, సోమా సత్యనారాయణ, దివి సతీష్, సాక్షి సాయిబాబు, వీరమల్లు కొండలరావు, బోయిన రామరాజు, శౌంతి నాగరాజు, బేతపూడి వెంకటరమణ, గంటా కోటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవలో కేడీసీసీ బ్యాంక్

ముదినేపల్లి రూరల్: రైతుల సంక్షేమం కోసం కేడీసీసీ బ్యాంక్ పలు పథకాలు ప్రవేశపెట్టినట్లు బ్యాంక్ ముదినేపల్లి బ్రాంచ్ మేనేజర్ వీవీఎల్ఎస్ కుమార్ అన్నారు. మండలంలోని వాడవల్లిలో సొసైటీ అధ్యక్షురాలు బొర్రా విజయలక్ష్మీ ఆధ్వర్యాన కేడీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలపై కళాజాత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులతో పోటీగా రైతులకు సహకార సంఘాల ద్వారా కేడీసీసీ బ్యాంక్ రుణాలు అందిస్తుందని చెప్పారు. రుణాలపై తక్కువ వడ్డీ వసూలు చేస్తూ డిపాజిట్లకు అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను బిల్లపాడుకు చెందిన కళాకారులు ఎం.శేఖర్‌బాబు, ఎం.తిరుపతి కుమార్, బి.రమేష్, వై.వీరయ్య కళాజాత ద్వారా వివరించారు. సూపర్‌వైజర్ నాగభూషణం, సొసైటీ సెక్రటరీ కె.నాగమునీంద్రరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల గుర్తింపు



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ విష్ణుప్రసాదు

గుడివాడటౌన్(నందివాడ): ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని వాటిని క్షేత్రస్థాయిలో అర్హులకు అందించాలని నందివాడ ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డీజీ సర్వే, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు, జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. పంచాయితీ కార్యదర్శులు వారి పరిధిలోని గ్రామాల్లో సంబంధిత పథకాలకు అర్హులైన వారిని గ్రామ వలంటీర్ల ద్వారా గుర్తించడం, ఎప్పటికప్పుడు వారి వివరాలను అందజేసి పథకాలు అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈఓపీఆర్డీ జి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో ముందంజలో నిలవాలి



జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్న గృహ నిర్మాణాల్లో కైకలూరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్‌లో జగనన్న గ్రీన్ విలేజ్‌లో గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో పెద్ద లేఅవుట్‌లు ఉన్నాయన్నారు. ఇప్పటికే అర్హులైన అనేక మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఆర్త హోమ్స్ సంస్థ నిర్మాణాలకు ముందుకు రావడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. ఏలూరు రోడ్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇప్పటికే విద్యుత్, తాగునీరు, రహదారులను ఏర్పాటు చేశామన్నారు. సచివాలయం, అంగన్‌వాడీ, పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, శ్మశానం, తాగునీటి చెరువు ఇలా అనేక సౌకర్యాలు ఇక్కడ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలని సూచించారు.

అల్లినగరంలో తెగుళ్ల పరిశీలన



అల్లినగరంలో పెస్ట్ సర్వే నిర్వహిస్తున్న డిజిటల్ సీర్పీ గౌతమ్‌కుమార్ తదితరులు

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో పెస్ట్ సర్వే బుధవారం నిర్వహించారు. పలు పంట చేలల్లో పురుగులు, తెగుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బూడిద తెగులు గుర్తించినట్లు పేర్కొన్నారు. తెగులు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయి కంటే తక్కువగా ఉందని, మజ్జిగ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మాస్టర్ ట్రైనర్ పృథ్వీ, నాగవిజయ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు సత్కారం



గుడివాడటౌన్ :ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ పిన్నమనేని ప్రశాంత్ కుమార్‌ను ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్థోపెడిక్ విభాగంలో ఉత్తమ సేవ అవార్డును రాష్ట్ర గవర్నర్ హరిచందన్ విశ్వభూషణ్ చేతులమీదుగా అందుకున్న వైద్యుడు పట్టణంలో సేవలందిచండం అభినందనీయం అన్నారు. క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, ఉపాధ్యక్షుడు కొనకళ్ల సీతయ్య, చిట్టిబాబు, కుటుంబరావు పాల్గొన్నారు.

వెలమ సంఘం సేవలు అభినందనీయం

గుడివాడటౌన్: తమ సామాజిక వర్గంలో వెనుకబడిన వారిని గుర్తించి ఆర్థిక సహాయం అందించేలా సామాజిక సంఘాలు కృషి చేయడం అభినందనీయం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక 7వ వార్డులోని వెలమ ఫంక్షన్ హాల్లో బుధవారం సామాజిక వర్గానికి చెందిన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 28 మంది మహిళలకు రూ.500 చొప్పున నగదు సైతం పంపిణీ చేశారు. రామాలయంలో రామనామ పారాయణం చేస్తున్న విజయదుర్గ భక్త భజన బృందం సభ్యులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. జి.ప్రభాకరరావు, వి.శ్రీనివాసరావు, జి.ఆనంద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో అన్నసమారాధన

గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అన్నసమారాధనా కార్యక్రమాన్ని గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి చేతుల మీదుగా ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించి స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, ఉత్సవ కమిటీ చైర్మన్ గుడివాడ సత్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవితను తీర్చిదిద్దుకోవాలి

మండవల్లి: జీవితంలో ఎదగాలనుకుంటే కష్టపడటం తప్పనిసరి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని లోకుమూడి వికాస్ కళాశాల ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో చక్కటి ఆలోచనలతో, కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జీవితంలో స్వయంకృషితో ఎదిగిన డీఎన్నార్, టీవీఆర్, ఎస్ఐ రామకృష్ణ విద్యార్థులకు స్ఫూర్తి కావాలన్నారు. ఎస్ఐ టి.రామకృష్ణ, వికాస్ అధినేత టీవీఆర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

తోట్లవల్లూరు:ఈ నెల 18న జరిగే శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఐలూరు గల గంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి పంచాయతీ, రెవెన్యూ, ఫైర్, ట్రాన్స్‌కో, ఫిషరీస్, ఆర్టీసీ, పోలీస్, సెబ్, వైద్యం, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులతో శివరాత్రికి తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. లక్ష మందికిపైగా తరలివచ్చే భక్తజనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్ పిరాటి సుజాత, సీఐ ఎం. కిషోర్‌బాబు, ఎస్ఐ రమేష్, ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్య సూర్య వరప్రసాద్, ఎంపీటీసీ భీమవరపు శ్రీలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్, ఆలయ మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

98 మంది పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

గుడివాడటౌన్: ప్రజలకు సేవలందిస్తున్న పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుడివాడ డీఎస్పీ ఎన్.సత్యానందం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 45 ఏళ్లు పైబడిన పోలీసులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి ఒత్తిడితో కూడుకుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితులపై శ్రద్ధ పెట్టకుంటే రోగాలబారినపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందుగానే వైద్యపరీక్షలు నిర్వహిస్తే జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. మొత్తం 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని అంతామెరుగైన ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్నారని వెల్లడించారు. టూటౌన్ సీఐ బి.తులసీధర్, ఎస్ఐలు పి.గౌతమ్‌కుమార్, పి.నాగరాజు, కానిస్టేబుళ్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సహకారంతో ఇళ్ల నిర్మాణం



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ అప్పికట్ల అశాజ్యోతి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి చెప్పారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను గ్రామ సర్పంచ్ అప్పికట్ల అశాజ్యోతితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 550 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారంతో లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

అనంతరం గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. పామర్రు మార్కెట్ యార్డు డైరక్టర్ చీకుర్తి వరప్రసాద్, గ్రామ పార్టీ కన్వీనర్ మండవ జానకరామయ్య (మున్నా), ఉప సర్పంచ్ వెంట్రప్రగడ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ



శిక్షణనిస్తున్న ట్రైనర్ కే లక్ష్మీ

మొవ్వ:గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, భారతీయ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో మొవ్వ ఎంపీడీవో కార్యాయలంలో మహిళా టైలరింగ్ పై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 30 రోజులపాటు సాగే ఈ శిక్షణ కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయంగా తమకు తాము ఆదాయ వనరులు సృష్టించే అవకాశం ఉందని మచిలీపట్నంకు చెందిన డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధి, ట్రైనర్ కె.లక్ష్మీ తెలిపారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా 34 మంది మొవ్వ మండలానికి చెందిన మహిళలు శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. వీరికి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నుంచి సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు.